విద్య, సంక్షేమ రంగాలకుఅత్యధిక ప్రాధాన్యత

సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, సంక్షేమ రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు నాణ్యమైన విద్యతో భవిష్యత్తును నిర్మించుకునేలా ప్రభుత్వం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తోందని రాష్ట్ర షెడ్యూల్ కులాలు, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ సాధికారిక శాఖల మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్య, భోజనం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. వసతి గృహాల్లో నివసిస్తూ చదువుతున్న ప్రతి విద్యార్థిని తమ స్వంత పిల్లలుగా భావించి సంపూర్ణ బాధ్యతతో సంరక్షించాలని, విధుల్లో అలసత్వం, బాధ్యతారాహిత్యం కనబడితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. బుధవారం భూపాలపల్లి ఐడీఓసీ కార్యాలయంలో భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, ఎస్సీ-ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్సీఓలు, జిల్లా కోఆర్డినేటర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలతో వసతి గృహాల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై మంత్రి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలు కేవలం భోజనం, నివాసానికి మాత్రమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని, అందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, తరగతి వారీ హాజరు, ఉత్తీర్ణత శాతం, డ్రాప్‌అౌట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రతి వసతి గృహంలో స్టడీ అవర్స్‌ను కచ్చితంగా అమలు చేయాలని, అవసరమైన చోట అదనపు ఫ్యాకల్టీ, గెస్ట్ లెక్చరర్ల సేవలు వినియోగించి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

ఆహారం, ఆరోగ్యం పై రాజీ ప్రసక్తే లేదు

వసతి గృహాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందేలా కఠిన పర్యవేక్షణ ఉండాలని మంత్రి ఆదేశించారు. ఆహార నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. చిన్న ఆరోగ్య సమస్యలు కూడా పెద్దగా మారకుండా ముందస్తు వైద్య చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట సమీప ప్రభుత్వ ఆసుపత్రులతో అనుసంధానం కల్పించాలని ఆదేశించారు.

భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు

వసతి గృహాల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని మంత్రి స్పష్టం చేశారు. అనుమతి లేకుండా విద్యార్థులను హాస్టళ్ల నుంచి బయటకు పంపరాదని, బయటి వ్యక్తులు హాస్టళ్లలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు.మహిళా వసతి గృహాల్లో షీ-టీమ్‌ల ద్వారా తరచూ తనిఖీలు నిర్వహించి భద్రతా భావాన్ని బలోపేతం చేయాలని సూచించారు. విద్యార్థులు భయంలేకుండా, ఆత్మవిశ్వాసంతో చదువుకునే వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

సిబ్బంది బాధ్యత – జీతాలపై స్పష్టత

వసతి గృహాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల వేతనాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. జీతాల ఆలస్యం కారణంగా సేవల్లో లోపాలు తలెత్తకుండా స్పష్టమైన వ్యవస్థ అమలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రతి హాస్టల్‌కు ప్రత్యేక పర్యవేక్షణ అధికారిని నియమించి విద్యార్థులతో మమేకమై డైట్, సంరక్షణ, భద్రత, క్రమశిక్షణపై ప్రత్యక్ష బాధ్యత వహించేలా చూడాలని ఆదేశించారు.

మౌలిక వసతుల మెరుగుదల

మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, భవన మరమ్మతులు వంటి మౌలిక వసతుల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వసతి గృహ సందర్శన

అంతకు ముందు మంత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరిస్, సత్య శారద, భూపాలపల్లి ఎస్సీ సంకీర్త్, ఐటిడిఎ పీఓ చిత్రామిశ్రా, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ సి. శ్రీధర్, ఎస్సీ కార్పొరేషన్ జీఎం హన్మంతు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ పోశం, మంత్రి ఓఎస్డీ విజయ్ కుమార్, పీఆర్‌వో అమృత్ తదితరులు పాల్గొన్నారు.

హిందువుల హత్యలు ఆపాలి

బంగ్లాదేశ్‌లో మైనార్టీలకు రక్షణ కల్పించాలి : వీహెచ్‌పీ

విశ్వంభర, హైదరాబాద్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింస ఆందోళనకరంగా మారిందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి మైనార్టీలు, ముఖ్యంగా హిందువులు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. గత రెండు వారాల్లో దీపు చంద్రదాస్, అమృత్ మండల్, భజేంద్ర బిశ్వాస్ అనే ముగ్గురు హిందూ యువకులు కిరాతకంగా హత్యకు గురయ్యారని తెలిపారు. దేవాలయాల ధ్వంసం, ఇళ్లలోకి చొరబడి దోపిడీలు, నివాస ప్రాంతాల దహనం, హిందూ స్త్రీలు-యువతులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ హింసను అరికట్టడంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. హింసను ప్రేరేపిస్తున్న ఆ దేశ ప్రధాని మహమ్మద్ యూనస్‌కు ఇచ్చిన నోబెల్ శాంతి బహుమతిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందూ వ్యతిరేక రాడికల్ మూమెంట్ కొనసాగుతోందని, దీనిని అరికట్టేందుకు అంతర్జాతీయ సమాజం నైతికంగా స్పందించాలని కోరారు. ప్రపంచ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకొని అక్కడి మైనార్టీలకు రక్షణ కల్పించాలని బాలస్వామి విజ్ఞప్తి చేశారు.

శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో

శివ ప్రకాష్ ప్రత్యేక పూజలు

విశ్వంభర, ఎల్బీనగర్ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని గోసగుండ్ల శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు శివ ప్రకాష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శివ ప్రకాష్ మాట్లాడుతూ స్వామివారి దీవెనలతో కాలనీవాసులు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలియజేశారు. ఫనిగిరి కాలనీ అధ్యక్షుడు అజయ్, ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి.. శివ ప్రకాష్‌ను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, తోట శ్రీను, స్వామి,శ్రీను స్వామి, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు రవి యాదవ్, కళ్యాణ్, ప్రవీణ్ కుమార్, గణేష్, గానీ, హరీష్, మహేష్, అసిఫ్, వల్లీ, రిషి గౌడ్ ఉన్నారు.

ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయడం హర్షనీయం

విశ్వంభర, ఆమనగల్లు : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆమనగల్లు మండల కేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిల కృషితో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు అన్నారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు మండల కేంద్రంలో ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో అతి త్వరలో సబ్ రిజిస్టర్, ఎస్టిపో, అన్ని డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో ఈ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తోట శ్రీను, మాజీ కోఆప్షన్ మెంబర్ ఖాదర్ ఖాద్రి, కృష్ణ నాయక్, పూసల సత్యం, మల్లేష్ నాయక్, చెన్నారెడ్డి, మైసయ్య, కుమార్ గౌడ్, శ్రీను నాయక్, ఖాదర్, హలీం, నాజర్, రఫీ, వాటర్ బాబా, మహేష్, పాతకోట రాజు, గౌస్, ఎంగిలి ప్రసాద్, జైపాల్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తాం

మంత్రి దామోదర్ రాజనర్సింహ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ బాధ్యత అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. 2026లో ప్రజలకు చక్కని వైద్యం అందేలా చూస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 2026లో నాన్ కమ్యూనికెబుల్ డిసీజెస్ నివారణ, నియంత్రణ, చికిత్స, పాలియేటివ్ కేర్‌పై మరింత ఫోకస్ చేస్తామని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఎన్‌సీడీసీ క్లినిక్స్, డే కేర్ కేన్సర్ క్లినిక్స్ ద్వారా గ్రామాల సమీపంలోకి వైద్య సేవలను తీసుకెళ్లామని మంత్రి గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్‌ను విస్తృతం చేస్తున్నామని, 2026లో రాష్ట్రవ్యాప్తంగా వందకుపైగా క్రిటికల్ కేర్ బ్లాక్స్, ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు. పది నిమిషాల్లోనే ఘటన స్థలానికి చేరుకుని వైద్య సేవలు ప్రారంభించేలా "108 అంబులెన్స్" సర్వీసెస్‌ను ఎక్స్‌పాండ్ చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. దశాబ్దాల ఉస్మానియా నూతన హాస్పిటల్ ఆకాంక్షను 2025లో నెరవేర్చుకున్నామని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు కొత్త భవనాలను నిర్మించుకున్నామన్నారు. 2026లో 4 కొత్త మల్టీ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. గుండె, కిడ్నీ జబ్బులు, కేన్సర్ వంటి మొండి వ్యాధులకు సైతం పేదలు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేలా ఈ హాస్పిటళ్లను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చి వైద్య విద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. బీపీ, షుగర్, ఒబెసిటీ, కిడ్నీ, గుండె జబ్బులు, కేన్సర్లకు కారణమైతున్న అనారోగ్యకర అలవాట్లను మానుకోవాలని, కొత్త సంవత్సరంలో ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని మంత్రి సూచించారు.

నకిరేకల్ నియోజకవర్గం ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశ్వంభర, రామన్నపేట : రామన్నపేట మండల ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు.. సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో 2025 లో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించామని గుర్తు చేశారు.ఈ సంవత్సరం కూడా అదే స్ఫూర్తితో అన్ని రంగాల్లో రాష్ట్రాన్నీ పురోభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుపుతాం అన్నారు. గత ఏడాది అంతా సుఖ సంతోషాలతో గడిచినట్లే ఈ ఏడాది మీ కుటుంబాలు సుఖ శాంతులతో విలసిల్లాలని కోరుతున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత నూతన లక్ష్యాలు పెట్టుకోండి. అలక్ష్యాలను అందుకునేందుకు ప్రణాళికలు సిద్దం చేసుకోండి, వచ్చే ఏడాది నాటికి వాటిని మీరు చేరుకునేలా కష్ట పడండి. 2025 వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2026లోకి అడుగుపెడుతున్న మండల ప్రజలకు శుభం కలగాలని కోరుతూ, అందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రామన్నపేట మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశ్వంభర, రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల ప్రజలకు, కొమ్మాయిగూడెం గ్రామ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు, వివిధ శాఖల అధికారులకు, వివిధ పార్టీల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు, సోదరీమణులకునూతన సంవత్సర శుభాకాంక్షలను బిజెపి పార్టీ మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి తెలిపారు. . ఈ నూతన సంవత్సరం నుంచి ప్రతి ఒక్కరూ ఆనందంగా ఆరోగ్యంగా ఆర్థికంగా ఉండాలన్నారు.

యూరియా కోసం అధైర్య పడొద్దు

విశ్వంభర, సిద్దిపేట : రైతులు ఎవరూ కూడా అధైర్య పడొద్దని జిల్లాలో సరిపడినన్ని యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు.మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని రైతు వేదికలో యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు యాసంగి సీజన్‌లో ఎక్కడ కూడా యూరియా కొరత రాకుండా పగడ్బందీగా ప్రణాళిక ప్రకారం అన్ని సెంటర్లలో యూరియా బస్తాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మీ ప్రాంతాల్లోని వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని, పాసుబుక్ తీసుకుని వచ్చి యూరియా కార్డులను తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎకరాకు 2బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు తెలిపారు.కౌలు రైతులు సైతం అధైర్య పడొద్దని, పట్టేదార్ పాస్ బుక్ జిరాక్స్ తీసుకొస్తే యూరియా అందిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న యూరియా కొరత కథనాలను నమ్మొద్దని ప్రతీ రైతుకు యూరియా అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి హైదరాబాద్ నగరం అంటే చిన్న చూపు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : సీఎం రేవంత్ రెడ్డికి హైదరాబాద్ నగరం అంటే చిన్న చూపని, మొదటి నుంచి చెత్త నగరంగా చూస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద , డా సంజయ్ విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం నాడు ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన ఊహల నగరం ఫోర్త్ సిటీ అంటూ సీఎం ఊహల్లో ఉన్నారని ,రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రోను రద్దు చేశారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరుతో ఎక్కడ పడితే అక్కడ కూల్చివేతలకు పాల్పడ్డారని, విమర్శలు చేశారు. ఫార్మా సిటీ కట్టాలని బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దాన్ని సీఎం రేవంత్ రెడ్డి రద్దు చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాలేదని హైదరాబాద్ నగరం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని కోరితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అజహారుద్దీన్ ను మంత్రిని చేశారని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కళలు కంటే హైదరాబాద్ నగరం ఆగం అవుతుందని ఏద్దేవా చేశారు. . మహేశ్వరం, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న గ్రామాలను కార్పొరేషన్ లో కలిపి వారికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ ఎందుకు వెళ్తున్నారో ఎవరికి అర్థం కావడం లేదన్నారు.అసెంబ్లీని ప్రభుత్వం హుందాగా నడపాలని హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. మంత్రి శ్రీధర్ బాబుకు అసెంబ్లీ వ్యవహారాల మంత్రిగా అనుభవం ఉంది అసెంబ్లీలో వ్యక్తిగత విమర్శలు లేకుండా చూడాలని బిఆర్ఎస్,కాంగ్రెస్ ఎవరైనా వ్యక్తిగత విమర్శలు చేస్తే అడ్డుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నడపాలన్నారు. రాబోవు కొత్త సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీ రెట్టింపు ఉత్సహంతో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు.

భారతీయులపై ట్రంప్ కుట్రలు

- మాజీ ఎంపీ హన్మంతరావు



విశ్వంభర, తెలంగాణ బ్యూరో : అమెరికాలో నివసించే మన భారతీయులకు చాలా అన్యాయం జరుగుతోందని, అమెరికా నుండి భారతీయులను పంపించేందుకు ట్రంప్ కుట్ర చేస్తున్నారని మాజీ ఎంపీ వి.హన్మంతరావు ఆరోపించారు. గ్రీన్ కార్డ్ ఓల్డర్‌పైనా ట్రంప్ తీవ్రమైన ఒత్తిడి పెడుతున్నారని, వీసా ఉన్న భారత్ ప్రజలపై ట్రంప్ పెడుతున్న ఇబ్బందులపై మోడీ స్పందించాలని..మోడీ అమెరికాలో ఉన్న భారత్ ప్రజలను కాపాడే ప్రయత్నం ఎందుకు చేయట్లేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వీహెచ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం మోడీ చేస్తున్నారని, నెహ్రూను పేరు పక్కకు పెట్టే ప్లాన్.. గాంధీ పేరు మార్చే ప్లాన్ మోడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు మార్పుపై ప్రతి గ్రామంలో కేంద్రంపై, మోడీపైన నిరసన తెలియజేయాలని కాంగ్రెస్ శ్రేణులకు వీహెచ్ సూచించారు. మహాత్మా గాంధీని దేశ విదేశాలు గౌరవిస్తే మోడీ మాత్రం అవమాన పరచడం దారుణం మన్నారు. మూడు సార్లు ప్రధాని అయిన మోడీ బీసీల పైన ఎప్పుడైనా మాట్లాడారా? మతం పేరుతో దేశాని చిన్నాభిన్నం చేయాలి అని చూస్తే ఊరుకోమని వీహెచ్ హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ డ్రాఫ్ట్‌పై బీజేపీ తీవ్ర అభ్యంతరం.. పోరాడతామని ప్రకటన

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : జీహెచ్ఎంసీ పరిధిని 150 డివిజన్ల నుంచి 300 డివిజన్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీలిమిటేషన్ డ్రాఫ్ట్‌పై బీజేపీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. బుధవారం జీహెచ్ఎంసీలో జరుగుతున్న డీలిమిటేషన్ ప్రక్రియపై ఆపార్టీ డీలిమిటేషన్ పర్యవేక్షణ కమిటీ సభ్యులు జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి ఈ ప్రక్రియలో లోపాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ప్రభాకర్‌మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు విడుదల చేసిన 300 డివిజన్ల తుది జాబితా అనేక తప్పులతడకలతో నిండి ఉందన్నారు. ఒక్క డివిజన్ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో ఉండటం,ఒక్క డివిజన్ రెండు రెవెన్యూ జిల్లాల్లో విస్తరించి ఉండటం, జనాభా ప్రామాణికమా విస్తీర్ణం ప్రామాణికమా ఓటర్ల సంఖ్య ప్రామాణికంగా చేశారో అధికారులు ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ స్వయంగా రూపొందించిన 300 డివిజన్ల మ్యాప్‌లా కనిపించడం లేదని, గాంధీభవన్, దారుస్సలాంలో కూర్చొని ఒక ప్రైవేట్ సర్వే ఏజెన్సీ రూపొందించిన ప్రతిపాదనలా ఉన్నట్లు తాము కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్‌పై ప్రజల నుంచి దాదాపు 10 వేల అభ్యంతరాలు, సూచనలు వచ్చినప్పటికీ, వాటికి సమాధానం చెప్పే తీరిక కూడా జీహెచ్ఎంసీకి లేదని స్పష్టమవుతోంది. అక్కడక్కడ కేవలం పేర్లు మాత్రమే మార్చారు తప్ప, సహజ భౌగోళిక స్వరూపం, జనాభా సమతుల్యత, ఓటర్ల ప్రామాణికం వంటి కీలక అంశాల్లో ఎక్కడా దిద్దుబాటు జరగలేదన్నారు. జీహెచ్ఎంసీ ప్రజలను అడ్డుపెట్టుకుని, విస్తీర్ణాన్ని కారణంగా చూపుతూ వేల కోట్ల రూపాయల విదేశీ రుణాలు తెచ్చుకోవాలనే లక్ష్యంతోనే ఈ పరిధి విస్తరణ జరిగిందని ఆరోపించారు. సామాన్య పౌరులకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం గాంధీభవన్, దారుస్సలాం చేతుల్లో జీహెచ్ఎంసీని అప్పగించేందుకే రూపొందించిన ప్రణాళికలా ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఉందని అభిప్రాయపడ్డారు. రెండు రోజుల కితం నగరంలో కుక్క కాటుతో ఒక పసిప్రాణం తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకున్నప్పటికీ, కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా కూడా ప్రభుత్వం ఇప్పటివరకు జీహెచ్ఎంసీలో కనీస పరిపాలన అందించలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వం, అధికారులు 300 డివిజన్లలో ప్రజలకు ఎలా సమర్థవంతమైన పాలన అందిస్తారని నిలదీశారు. కాంగ్రెస్, మజ్లిస్ నిరంకుశ పరిపాలన తీరును ప్రజల ముందు ఎండగడతామని, జీహెచ్ఎంసీ విస్తరణ పేరిట జరుగుతున్న అక్రమాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.